PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :111 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : మంగళవారం - 06 అక్టోబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:111 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: TUESDAY 06 OCTOBER 2026 PAGES: 04 RS:01/

రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం

- 90 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- హార్టికల్చర్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధే ఎజెండా
- ఆ దిశగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోంది
- ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' ప్రారంభం
- రూ.30,156 కోట్లతో జలధార ప్రాజెక్టు నిర్మాణం





ప్రొద్దుటూరు,అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో మిగతా2లో...



భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ,అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ మిగతా2లో...

మహిళలపై నేరాలను అరికట్టండి

- శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి
- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ



న్యూఢిల్లీ,5(నేటి మినిట్ టు మినిట్): మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మిగతా2లో...

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు

- జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిన జగన్
- ప్రాంతీయ విపక్ష లేకుండా అభివృద్ధి పనులు
- ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్
- ప్రొద్దుటూరులో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- పాల్గొన్న డిప్యూటీ సిఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్



ప్రొద్దుటూరు, అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మిగతా2లో...



పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాలు


- వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్పు
- 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

అమరావతి,అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరు కోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మిగతా2లో...

ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం





వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

- ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్
- కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం

న్యూఢిల్లీ, 5(నేటి మినిట్ టు మినిట్): ఈ ఏడాదికి నోబెల్ పురస్కారాల విజేతల ప్రకటన వైద్య శాస్త్రంతో ప్రారంభమైంది. మెదడు కార్యకలాపాలపై (ఆప్టోజెనెటిక్స్) పరిశోధకులకు వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి వరించింది. మెదడులోని నాడుల కార్యకలాపాలు ప్రారంభం లేదా నిలిపివేత సమయంలో సంభవించే అంతర్గత ప్రక్రియలపై పరిశోధనలకు అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్ (54), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (71), జార్జ్ నాజెల్ (73) అనే శాస్త్రవేత్తలకు మిగతా2లో...

అంబటి రాంబాబుకు నోటీసులు



రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు."రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోడీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా" అని నిలదీశారు."ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్- స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు. మరోవైపు భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఈ మేరకు సోమవారం దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్‌ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది.

మహిళలపై నేరాలను అరికట్టండి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు

(మొదటి పేజీ తరువాయి)

కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు.

పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాలు

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు.

ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

న్యూఢిల్లీ,అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా జరిగితే ఎవరు చేశారు అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

అంబటి రాంబాబుకు నోటీసులు

అమరావతి, అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు. 'మెదడులోని రహస్యాలను ఛేదించడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు.గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతిని ప్రకటించిన అనంతరం, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ప్రకటిస్తారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, రాయల్ స్వీడిష్ అకాడమీ, నార్వేజియన్ కమిటీలు నోబెల్ బహుమతలను అందజేస్తాయి. ఏటా అక్టోబరు మొదటి వారంలో విజేతలను ప్రకటించి, డిసెంబరు 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున బహుమతులను ప్రధానం చేస్తారు.

ఏపీ స్పెషల్ టెట్ హాల్ టికెట్లు విడుదల..

అమరావతి,అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం నిర్వహించనున్న స్పెషల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)-2026 హాల్ టికెట్లను విడుదల చేసినట్లు టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి ప్రకటించారు. అభ్యర్థులు అక్టోబర్ 5వ తేదీ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 68,420 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో (సీబీటీ) పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. మొదటి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ల నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తమ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ లాగిన్ వివరాలు మర్చిపోయినట్లయితే 'నో యువర్ యూజర్ ఐడీ' లేదా 'ఫర్గాట్ పాస్‌వర్డ్' ఆప్షన్ల ద్వారా వాటిని తిరిగి పొందవచ్చని అధికారులు వివరించారు. 2011కు ముందు నియమితులై, టెట్ అర్హత లేని ఇన్-సర్వీస్ టీచర్ల కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ స్పెషల్ టెట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలో సాధించిన అర్హత కేవలం ప్రస్తుత సర్వీసు కొనసాగింపు లేదా ప్రమోషన్లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. పరీక్షల అనంతరం అక్టోబర్ 24న ప్రాథమిక కీ, నవంబర్ 10న తుది కీ విడుదల చేసి, నవంబర్ 15న ఫలితాలను ప్రకటించనున్నారు.

‘ దాటిజ్ ‘ జాయింట్ కలెక్టర్ ...!

● సత్యసాయి జిల్లా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ఉదారత చాటుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ● వినతి వచ్చిన వెంటనే స్పందించి వీల్ చైర్లు మంజూరు చేసిన జాయింట్ కలెక్టర్ ● నలుగురు దివ్యాంగులకు స్వయంగా సహాయ ఉపకరణాలు అందజేత





పుట్టపర్తి, అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక“ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ తన ఉదారతతో మానవ త్వాన్ని చాటుకున్నారు.సోమవారం పుట్టపర్తిలోని రెవెన్యూ భవనంలో నందు జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న సమయంలో కదిరి డివిజన్‌కు చెందిన పలువురు దివ్యాంగులు తమకు నడవడానికి వీల్ చైర్లు అవసరమని జాయింట్ కలెక్టర్ గారిని వేడుకున్నారు. అర్జీదారుల పరిస్థితిని చూసి వెంటనే స్పందించిన జేసీ గారు, వికిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించి అక్కడికక్కడే తక్షణ సహాయాన్ని మంజూరు చేశారు.అనంతరం దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయంగా పంపిణీ చేశారు. లబ్ధిదారుల వివరాలు: వి. నవీన్ కుమార్ రెడ్డి (గాండ్లపెంట) రామాంజులు (కదిరి పట్టణం) బి. రమాదేవి (బోయపల్లి) ఆంజనేయులు (కదిరి పట్టణం) సంబంధిత శాఖల అధికారులు వేగంగా స్పందించి తమకు వీల్ చైర్లు అందజేయడం పట్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వికిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు బి. అనిల్, కార్యాలయ సహాయకులు గంగాద్రి, ఇతర జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

“ కాంట్రాక్టర్ కక్కుర్తి.... గుడ్డుకు ఇవ్వండి విముక్తి “

● విద్యార్థుల కడుపు కొడుతున్న కాంట్రాక్టర్ ● మధ్యాహ్న భోజనంలో 28 గ్రాముల గుడ్డేనా? ● 28 గ్రాముల గుడ్డుతోనే విద్యార్థుల కడుపు నింపుతారా? ● “విద్యార్థులకు గుడ్డులో కోత.. పాఠశాలలో సౌకర్యాలకు కొరత“ ● స్కూల్‌లో గుడ్డు చిన్నది.. సమస్యలు పెద్దవి ● మధ్యాహ్న భోజనంలో కోతలు.. మౌలిక సదుపాయాలు మాయం ● మినరల్ వాటర్ ప్లాంట్ మూత.. విద్యార్థులకు తాగునీటి కష్టాలు ● “భోజనశాల లేక ఎండలోనే భోజనం.. గుంతకల్లు స్కూల్‌లో విద్యార్థుల అవస్థలు” ● “ప్రభుత్వ పాఠశాలలో సమస్యల వలయం.. ‘స్కూల్ బచావో’తో ఎస్ఎఫ్ఐ గళం” ● గుంతకల్లు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

గుంతకల్లు: అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లి‘స్కూల్ బచావో’లి కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. **గుడ్డు బరువు 28 గ్రాములేనా?**మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, గుంతకల్లు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు.విద్యార్థులకు అందిస్తున్న గుడ్డు సుమారు 28 గ్రాములు మాత్రమే ఉంటోందని విద్యార్థులు తెలిపారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిమాణంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. విద్యార్థులకు అందాల్సిన ఆహారంలో ఎలాంటి కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.**తరగతి గదులు లేక ఇబ్బందులు**పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అదనపు తరగతి గదులను తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. **మినరల్ వాటర్ ప్లాంట్ ఎందుకు నిరుపయోగం?**పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని వారు ఆరోపించారు. దీంతో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు.విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరారు. **ఎండలోనే మధ్యాహ్న భోజనం?**మధ్యాహ్న భోజనం చేసే సమయంలో విద్యార్థులు ఎండలో లేదా సరైన సౌకర్యాలు లేని ప్రదేశాల్లో భోజనం చేయాల్సి వస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా భోజనశాలను నిర్మించి, సౌకర్యవంతమైన వాతావరణంలో భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.**సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లోని సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న, సాయి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





గుడ్డు బరువు చూస్తున్న విద్యార్థులు

‘ ఈ అనంతపురంకు ఏమైంది... ఓ వైపు చైన్ స్నాచింగ్స్... మరో వైపు హత్యలు ‘

అనంతపురంలో చైన్ స్నాచర్ల హల్‌చల్

పగలు.. రాత్రి తేడా లేకుండా వరుస చోరీలు

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చైన్ స్నాచింగ్.. పోలీసుల తీరుపై ప్రజల్లో ఆందోళన

అనంతపురం: అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం నగరంలో చైన్ స్నాచర్లు వరుస ఘటనలతో హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకుంటుండటంతో మహిళలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**కలెక్టరేట్ సమీపంలోనే చైన్ స్నాచింగ్**నగరంలో తాజాగా చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ ఘటన పోలీసు భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది.ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఆ ప్రాంతంలో పోలీసుల రాకపోకలు, భద్రత సాధారణంగా ఎక్కువగా ఉంటాయని ప్రజలు చెబుతున్నారు. అలాంటి ప్రాంతంలోనే చైన్ స్నాచింగ్ జరగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. **వారం రోజులు గడవకముందే వరుస ఘటనలు?**ఇటీవల నగరంలో వరుసగా చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే పలుచోట్ల ఇలాంటి ఘటనలు జరగడం నగరవాసుల్లో ఆందోళన పెంచుతోంది.తాజాగా జరిగిన ఘటనకు ముందు కూడా ఇదే మార్గంలో చైన్ స్నాచింగ్ జరిగినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఒకే ప్రాంతంలో వరుస ఘటనలు చోటుచేసుకుంటుండటంతో పోలీసులు నిఘాను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.**పోలీసుల నిఘా ఎక్కడ?**పట్టణంలో నిత్యం పెద్ద సంఖ్యలో పోలీసులు విధుల్లో ఉన్నప్పటికీ చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై పోలీసుల నిఘా వ్యవస్థ మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.**చైన్ స్నాచింగ్.. వృద్ధురాలి హత్యతో ఉలిక్కిపడిన నగరం**ఒకవైపు పట్టపగలే చైన్ స్నాచింగ్ ఘటన.. మరోవైపు అదే సమయంలో నగరంలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన అనంతపురం ప్రజలను మరింత కలవరపాటుకు గురిచేసింది.నగరంలో ఏ క్షణంలో ఏ ఘటన జరుగుతుందోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారని పలువురు అంటున్నారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్న పరిస్థితి కనిపిస్తోందని పేర్కొంటున్నారు.**శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**వరుస చైన్ స్నాచింగ్ ఘటనలకు అడ్డుకట్ట వేయడంతో పాటు అనుమానితుల కదలికలపై నిఘా పెంచాలని నగరవాసులు కోరుతున్నారు. ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాను మరింత పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.చైన్ స్నాచర్లను కట్టడి చేసి మహిళలకు భద్రతపై భరోసా కల్పించాలని అనంతపురం ప్రజలు కోరుతున్నారు.**వృద్ధురాలి హత్య కేసు 5 గంటల్లో ఛేదింపు**



కోవూరునగర్‌లో దారుణ హత్య.. వరుసకు మనవడే నిందితుడుబంగారు కమ్మల కోసం ఘాతుకం.. నిందితుడి అరెస్ట్, బంగారు కమ్మలుకట్టర్ బ్లేడు స్వాధీనంఅనంతపురం నగరంలోని కోవూరునగర్‌లో వృద్ధురాలి దారుణ హత్య కేసును అనంతపురం జిల్లా పోలీసులు కేవలం ఐదు గంటల్లోనే ఛేదించారు. బంగారు కమ్మల కోసం వరుసకు బామ్మ అయిన వృద్ధురాలిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మినారాయణను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి హతురాలి రెండు బంగారు చెవి కమ్మలతో పాటు నేరానికి ఉపయోగించిన కట్టర్ బ్లేడును స్వాధీనం చేసుకున్నారు.**ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి**పోలీసుల వివరాల ప్రకారం.. అనంతపురం టౌన్ కోవూరునగర్‌లో నివాసముంటున్న మీసాల సన్నాగులు (87) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ఇదే అదనుగా భావించిన నిందితుడు ఆమెపై రోకలి కట్టెతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం కట్టర్ బ్లేడుతో ఆమె చెవులను కోసి, చెవులకు ఉన్న బంగారు కమ్మలను తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. **ఐదు గంటల్లోనే నిందితుడి అరెస్ట్**సమాచారం అందుకున్న వెంటనే ఫోర్త్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో పాటు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు.సంఘటనా స్థలంలో లభించిన రోకలి కట్టె తదితర ఆధారాలను పరిశీలించిన పోలీసులు.. హతురాలికి వరుసకు మనవడైన లక్ష్మినారాయణపై అనుమానం వ్యక్తం చేశారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తును కొనసాగించి సోమవారం రాత్రి రామనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అతడిని అదుపులోకి తీసుకున్నారు.**బంగారు కమ్మలు.. కట్టర్ బ్లేడు స్వాధీనం** పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. అతని వద్ద నుంచి హతురాలి రెండు బంగారు చెవి కమ్మలు, నేరానికి ఉపయోగించిన కట్టర్ బ్లేడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు లక్ష్మినారాయణ పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. హతురాలి సొంత మనవడు గోపాల్‌కు నిందితుడు బావమరిది అని వెల్లడించారు.**పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు** జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ కరుణాకర్ రావు పర్యవేక్షణలో అనంతపురం నగర సీఐలు, సీసీఎస్ సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి.దారుణం జరిగిన కొద్ది గంటల్లోనే సాంకేతిక పరిజ్ఞానం, సమయస్ఫూర్తితో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేయడంపై జిల్లా ఎస్పీ పోలీసు బృందాలను ప్రత్యేకంగా అభినందించారు.నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఎస్పీ స్పష్టం చేశారు.



నిందితుడు వాడిన రోకలి బండ



హత్య జరిగిన తీరు పరిశీలిస్తున్న పోలీసులు

చైన్ స్నాచింగ్ జరిగిన స్థలంలో వన్ టౌన్ సిఐ కరుణాకర్ మరియు బీకే యాస్ పోలీసులు

‘ సుజాతా....ఉపాధి హామీలో ... ‘ ఖాతా ‘

ఫోన్ పే కొట్టు... బిల్లులు పట్టు

కూలీలకు టైం స్కానర్.. అధికారులకు ఫోన్ పే స్కానర్

పని చేస్తే కూలీ.. ఫోన్ పే చేస్తే బిల్లు

ఉపాధి హామీకి కొత్త రూల్.. ‘ఫోన్ పే’ ఉంటేనే బిల్లు

కూలీల హాజరుకు ఫోటో.. బిల్లులకు ఫోన్ పేనా?

బిల్లు కావాలా బాబూ? ముందు ‘ఫోన్ పే’ కొట్టు

ఉపాధి హామీనా.. ఫోన్ పే హామీనా?

టైం స్కానర్ కూలీలకు.. ‘పే స్కానర్’ అధికారులకు

పని మాది.. ఫోన్ పే మీదా? బిల్లుల బాగోతంపై వ్యంగ్యాస్త్రాలు

కూలీకి హాజరు తప్పనిసరి.. బిల్లుకు ‘ఫోన్ పే’ తప్పనిసరా?

అభివృద్ధి పనుల బిల్లా.. ‘ఫోన్ పే’ బిల్లా?

“ఫోన్ పే చేశారా? బిల్లు రెడీ!” ఉపాధి హామీకి కొత్త నిర్వచనమా?


కూలీల చెమటకు లెక్కలు.. ‘ఫోన్ పే’కు లెక్కలేదా?


ఉపాధి హామీ కార్యాలయంలో ‘పే’ మంత్రం

బిల్లు ఫైల్ కదలాలంటే.. ఫోన్‌లో బ్యాలెన్స్ ఉండాలా?

కూలీలకు పని హామీ.. అధికారులకు ‘పే’ హామీ?

బుక్కరాయసముద్రం:అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) బిల్లుల చెల్లింపుల విషయంలో బుక్కరాయసముద్రం మండలానికి చెందిన అధికారులపై సంచలన ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బిల్లులు మంజూరు కావాలంటే ఫోన్ పే ద్వారా







ఫోన్ పే స్క్రీన్ షాట్స్

డబ్బులు చెల్లించాల్సి వస్తోందంటూ కొందరు ఆరోపణలు చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.**ఫోన్ పే చేయకపోతే బిల్లులు రావా?** “ఫోన్ పే చేయకపోతే బిల్లులు కావు” అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సంబంధిత అధికారులు చెబుతున్నారంటూ కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే విషయాన్ని అధికారులు తేల్చాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.**తోవ్వేకొద్దీ... బయటపడుతున్నాయా?** ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వ్యవహారాల్లో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. లక్షల రూపాయల వ్యవహారాలకు సంబంధించిన వివరాలు బయటకు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. **ఏసీబీ ఎందుకు దృష్టి సారించడం లేదు?**అధికారులపై ఇంత తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు, కేవలం రీల్స్ లో ప్రచారం జరుగుతోంది రియల్ గా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న ప్రజలు.**కూలీలకు నిబంధనలు... అధికారులకు వర్తించవా?** ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల హాజరును నిర్ధారించేందుకు టైం స్కానర్, ఫోటో హాజరు వంటి విధానాలను కఠినంగా అమలు చేస్తున్న అధికారులు... బిల్లుల చెల్లింపుల విషయంలోనూ అదే స్థాయిలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, సంబంధిత ఉన్నతాధికారులు బుక్కరాయసముద్రం మండలంలోని ఉపాధి హామీ పథకం వ్యవహారాలపై దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు. **మరిన్ని ఫోన్ పే లావాదేవీలు బయటపెడతామంటూ ప్రచారం** ఇదిలా ఉండగా, ఫోన్ పే ద్వారా జరిగినట్లు చెబుతున్న మరిన్ని లావాదేవీల వివరాలు తమ వద్ద ఉన్నాయని, తదుపరి కథనంలో వాటిని వెల్లడిస్తామని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.“ఇంత బహిరంగంగా ఫోన్ పే స్క్రీన్ షాట్స్ ఉన్నాయి నిజంగా ఆమె పైన చర్యలు తీసుకుంటారా లేక విచారణ అంటూ డ్రామాలాడుతారా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు“అయితే, సోషల్ మీడియాలో వస్తున్న ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు, ఉన్నతాధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.

నేతాజీ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

● జపాన్‌లో చారిత్రక నేషనల్ డైట్ భవనాన్ని సందర్శించిన బీజేపీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ● భారత్‌జపాన్ చారిత్రక స్నేహబంధం మరింత బలోపేతం కావాలి





జపాన్:అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): జపాన్ పర్యటనలో భాగంగా చారిత్రక నేషనల్ డైట్ (పార్లమెంట్) భవనాన్ని సందర్శించడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని బీజేపీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.జపాన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రస్థానానికి చారిత్రక సాక్ష్యంగా నిలిచిన నేషనల్ డైట్ భవనాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆజాద్ హింద్ ఉద్యమానికి జపాన్ అందించిన సహకారాన్ని స్మరించుకున్నారు.**నేతాజీ త్యాగాలను స్మరించుకుంటూ..**భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు.భారత్ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో జపాన్‌తో ఉన్న అనుబంధం ప్రత్యేకమైనదని, ఆ చారిత్రక స్నేహబంధాన్ని నేటి తరంలో మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.**భారత్‌జపాన్ బంధం మరింత బలోపేతం కావాలి**భారత్‌జపాన్ దేశాల మధ్య ఉన్న చారిత్రక స్నేహం, పరస్పర గౌరవం భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని విష్ణువర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించిన భారత రాయబార కార్యాలయ అధికారులకు, తన మిత్రుడు రాజనీష్‌కు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.“నేతాజీ స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తి” అని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని రైతుల ఆందోళన



దేవనకొండ అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అఖిలపక్ష నాయకులు, జెడ్పీటీసీ కిట్టు, వీరశేఖర్ నరసారావు ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు దేవనకొండ క్రాస్‌కు తరలివచ్చారు.రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరారు. రైతులకు అవసరమైన సహాయం అందించి పంట నష్టంపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అలార్దిన్నె ప్రభాకర్‌రెడ్డి, తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాజన్న నారాయణరెడ్డి, బద్రి, వెలమకూరి యువ నాయకులు రమేష్, మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

“ధర్మవరం గ్రామాలకు తాగునీటి భరోసా“

● గ్రామీణ తాగునీటి వసతులకు జల్ జీవన్ మిషన్ జోష్ ● రూ.11.80 కోట్లతో 41 పథకాల పునర్వ్యవస్థీకరణ ● 103 ఆవాసాలకు తాగునీటి ప్రయోజనం.. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ



ధర్మవరం, అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): ధర్మవరం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వసతులను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవ జల్ జీవన్ మిషన్ (జేజేఎం) 2.0 కింద పలు తాగునీటి పథకాలను పునర్వ్యవస్థీకరించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఇప్పటికే ఉన్న నీటి సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొంది.**రూ.11.80 కోట్లతో 41 పథకాలు** ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో మొత్తం 23 గ్రామాలు/పథకాలకు సంబంధించి 41 ఐఎంఐఎస్ పథకాలను జల్ జీవన్ మిషన్ 2.0 కింద పునర్వ్యవస్థీకరించినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ పథకాల మొత్తం అంచనా వ్యయం రూ.1,180.62 లక్షలు (రూ.11.80 కోట్లకు పైగా) కాగా, వీటి ద్వారా మొత్తం 103 ఆవాసాలకు తాగునీటి వసతులు మెరుగుపడనున్నాయని వివరించింది.**ధర్మవరం మండలానికి రూ.5.97 కోట్లు** ధర్మవరం మండలంలో నాలుగు గ్రామాలు/పథకాలకు సంబంధించి ఐదు ఐఎంఐఎస్ పథకాలను పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందుకోసం రూ.597.80 లక్షలు (దాదాపు రూ.5.98 కోట్లు) అంచనా వ్యయంగా నిర్ణయించగా, వీటి ద్వారా 19 ఆవాసాలకు తాగునీటి ప్రయోజనం చేకూరనుంది. **బత్తలపల్లిలో 33 ఆవాసాలకు ప్రయోజనం** బత్తలపల్లి మండలంలో ఏడు గ్రామాలు/పథకాలకు సంబంధించి 18 ఐఎంఐఎస్ పథకాలను పునర్వ్యవస్థీకరించనున్నారు. వీటి అంచనా వ్యయం రూ.304.76 లక్షలు కాగా, మొత్తం 33 ఆవాసాలకు తాగునీటి వసతులు మెరుగుపడనున్నాయి. **ముదిగుబ్బలో 38 ఆవాసాలకు నీటి వసతి** ముదిగుబ్బ మండలంలో తొమ్మిది గ్రామాలు/పథకాలకు సంబంధించి 14 ఐఎంఐఎస్ పథకాలను పునర్వ్యవస్థీకరించారు. ఇందుకు రూ.232.86 లక్షలు అంచనా వ్యయంగా ఉండగా, 38 ఆవాసాలకు ప్రయోజనం చేకూరనుంది. **తాడిమర్రిలో 13 ఆవాసాలకు ప్రయోజనం** తాడిమర్రి మండలంలో మూడు గ్రామాలు/పథకాలకు సంబంధించి నాలుగు ఐఎంఐఎస్ పథకాలను పునర్వ్యవస్థీకరించనున్నారు. వీటి అంచనా వ్యయం రూ.45.20 లక్షలు కాగా, 13 ఆవాసాలకు తాగునీటి వసతులు మెరుగుపడనున్నాయి.**ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు లక్ష్యం** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడటమే జల్ జీవన్ మిషన్ ప్రధాన లక్ష్యమని మంత్రి కార్యాలయం పేర్కొంది. గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన, పునరుద్ధరణ లేదా పునర్వ్యవస్థీకరణ అవసరమైన తాగునీటి పథకాలను గుర్తించి వాటిని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.**మౌలిక వసతులకు ప్రాధాన్యం** ధర్మవరం నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన కార్యాలయం వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.జల్ జీవన్ మిషన్ 2.0 కింద చేపడుతున్న పనులు పూర్తయితే ఆయా గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థలు మరింత బలోపేతం కానున్నాయని మంత్రి కార్యాలయం వివరించింది.

పరిశ్రమల స్థాపనలో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు అక్టోబర్ 5(నేటి మినిట్ టు మినిట్): జిల్లాలో పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో పరిశ్రమల స్థాపన పురోగతి పై కలెక్టర్ పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమలులో ఉన్న అన్ని రకాల భారీ పరిశ్రమలకు అవసరమైన అనుమతులను సకాలంలో మంజూరు చేసి, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏపిఐఐసి, పరిశ్రమల శాఖ, నెడ్ క్యాప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి కాలుష్య నియంత్రణకు అవసరమైన అన్ని రకాల అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఏరియాలో ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్‌లను త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఫౌండేషన్ స్టోన్ వేయడానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమలను గుర్తించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఏపిఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.